

భీమిలి కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులతో మంత్రి నారా లోకేశ్



మేయర్ మార్పుపై చట్ట సవరణకు చొరవ

- సీఎం దృష్టికి తీసుకువెళతా
- కార్పొరేటర్లతో నారా లోకేశ్
- జీవీఎంసీలో అవినీతి లేకుండా చూడండి
- ఆర్థిక ఇబ్బందులున్నా నగర అభివృద్ధికి నిధుల విడుదలకు కృషిచేస్తా



సమావేశానికి హాజరైన కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ మార్పు అంశం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో చట్ట సవరణకు యత్నిస్తానని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో గత ప్రభుత్వ హయాంలో అవినీతి పెరిగిందని పేర్కొంటూ, దానిని అరికట్టాలని సూచించారు. దాంతో కార్పొరేటర్లు ఒకరిద్దరు లేచి, జీవీఎంసీలో పాలన వైసీపీ చేతిలో ఉందన్నారు. మేయర్ పదవి కూటమికి దక్కాలంటే గత ప్రభుత్వం చేసిన చట్టాన్ని (మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయిన తరువాత మాత్రమే అవిశ్వాస తీర్మానం పెట్టేలా) మార్చాల్సి ఉందన్నారు. అందుకు లోకేశ్ బదులిస్తూ వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చట్టానికి సవరణ చేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానన్నారు. విశాఖపట్నం రాష్ట్రంలో అతిపెద్ద నగరమని, ఇక్కడ నీతివంతమైన పాలన ఉంటే మిగిలిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలకు ఆదర్శంగా ఉంటుందన్నారు. జీవీఎంసీలో కార్పొరేటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. నగరాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కొందరు కార్పొరేటర్లు కోరారు. లోకేశ్ స్పందిస్తూ, రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని, అయినా సాధ్యమైనంత మేర నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు, జీవీఎంసీలో ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ హాజరయ్యారు.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

ఎవరూ విర్రవీగొద్దు...

- ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి
- కూటమిలో మిగిలిన పార్టీలతో కలిసి పనిచేయండి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, నేతలకు మంత్రి నారా లోకేశ్ సూచన
- అక్టోబరు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు
- కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు
- అందరూ కలిసికట్టుగా అభివృద్ధికి కృషిచేయాలి

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

అధికారంలోకి వచ్చాం కదా అని విర్రవీగొద్దని, అణిగిమణిగి ఉండాలని ప్రజా ప్రతినిధులకు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జులకు, నేతలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు.



విశాఖ నగర శివారునున్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు ఉన్నారు



ప్రజా దర్బార్‌లో దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు ఇస్తే అధికారం తలకెక్కి...అరాచక పాలన సాగించి ప్రజాగ్రహానికి గురైందని గుర్తుచేశారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని, దీనికి అనుగుణంగా అక్టోబరు నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే/ఇన్‌చార్జి తమ పరిధిలో సభ్యత్వ నమోదు పక్కాగా చేపట్టాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన ... మిగతా 6వ పేజీలో

ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

- అందరూ సహకరించాలి
- గత ప్రభుత్వంలో మాదిరిగా వేధింపులు ఉండవు
- మీ సమస్యలు తీర్చే బాధ్యత మాది
- భీమిలి కేజీబీవీ సందర్శనలో మంత్రి నారా లోకేశ్
- విద్యాభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నాం

భీమునిపట్నం, ఆగస్టు 30:

"దేశంలో ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి మీ అందరి సహకారం ఎంతో అవసరం. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరిపైనా వేధింపులుండవు, మీ సమస్యలన్నీ తీర్చే బాధ్యత మాది."...

- భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయం తనిఖీ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్

మంత్రి శుక్రవారం ఉదయం విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తొమ్మిది, పది తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరిగి వెళుతుండగా సిబ్బంది అంతా 'థాంక్యూ సార్..' అని కోరస్‌గా చెప్పడంతో ఆగారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి పది లక్షల మంది విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారన్నారు. తాము అధికారంలోకి ... మిగతా 6వ పేజీలో



అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద వర్షం

కొనసాగుతున్న వర్షాలు

- పల్లపు ప్రాంతాలు జలమయం
- మరో 48 గంటలపాటు వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముసురు వాతావరణం కొనసాగుతోంది. శుక్రవారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం అనేక ప్రాంతాల్లో భారీవర్షం కురవడంతో కాలువలు, డ్రైన్లు పొంగాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, అక్కయ్య పాలెం, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సీతమ్మధారలో 27.75 మిల్లీమీటర్లు, మహారాణిపేటలో 22 మిల్లీమీ టర్లు, ఆరిలోవలో 15.25 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం ఆదివారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున... రానున్న 48 గంటల పాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

నగరంలో 26 మంది సీఐల బదిలీ
- వార్త II పేజీలో

జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా సోమన్నారాయణ
- వార్త I పేజీలో

బదిలీలకు మరో 15 రోజుల గడువు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు గడువు పెంచింది. వాస్తవానికి ముందు జారీచేసిన ఆదేశాల ప్రకారం ఈ నెల 31 నాటికి అన్ని శాఖల్లో బదిలీలు పూర్తికావాలి. అయితే అనేక కారణాలు, ఒత్తిళ్ల వల్ల పలు శాఖల్లో ఈ ప్రక్రియ కొలిక్కిరాలేదు. ప్రభుత్వం కూడా ఐఏఎస్ అధికారుల బదిలీలను ఇంకా చేస్తూనే ఉంది. ఎక్కడా అనర్హులకు కీలక పదవులకు దక్కకూడదని, సమర్థులైన వారికే మంచి పోస్టింగ్‌లు ఇవ్వాలనే ఆలోచనతో ఆచితూచి నిర్ణయం తీసుకుంటోంది. జిల్లా అధికారుల బదిలీల్లోను ఇదే విధానం అనుసరించాలని కూటమి నాయకులకు అధిష్ఠానాల నుంచి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురికి ఇచ్చిన లేఖలను వెనక్కి తీసుకోవడానికి కూడా కొందరు ఎమ్మెల్యేలు వెనుకాడడం లేదు.

వైసీపీతో అంటకాగిన అధికారికి సిఫారసు

ఎంపీడీఓ కేడర్‌కు చెందిన ఓ అధికారి వైసీపీ హయాంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో మంత్రుల వద్ద ప్రత్యేక అధికారిగా పనిచేశారు. ఆయన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా ఉంటూ ప్రభుత్వ భూములు చేతులు మారడానికి సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆయనకు జిల్లా పరిషత్ సీఈఓ పోస్టు ఇవ్వాలని ఉమ్మడి జిల్లాలో కీలక నాయకురాలు సిఫారసు చేశారు. తోడుగా మరో ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారు. ఈ విషయం తెలిసి జిల్లాలో ఓ ఎమ్మెల్యే మండి పడ్డారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారు. అవినీతిపరులకు కీలక పోస్టులు ఇవ్వబోమని ఆయన హామీ ఇచ్చారు.

ఉక్కులో ఆందోళన

- కాంట్రాక్టు కార్మికుల వేతనాల్లో యాజమాన్యం కోత
- బయోమెట్రిక్ వేయలేదని సాకు
- వ్యతిరేకిస్తూ వర్క్స్ ఈడీ కార్యాలయం ముట్టడించిన వేలాది మంది
- సమస్య పరిష్కారానికి సీజీఎం హామీ



వర్క్స్ ఈడీ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు యాజమాన్యం రోజుకో వివాదాన్ని తెచ్చి నెత్తిన పెట్టుకుంటోంది. ఇప్పుడు కాంట్రాక్టు కార్మికుల వేతనాల్లో కోత నిర్ణయం...వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి వరకు వెళ్లింది. ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు సమకూర్చుకోలేకపోతున్న యాజమాన్యం ఆ విషయం వదిలేసి...ఉక్కు మంత్రిత్వ శాఖ మెప్పు కోసం వ్యయాల తగ్గింపుపై దృష్టిపెట్టింది. అలవెన్సుల కోత, వేతనాల తగ్గింపు, ఉద్యోగుల డిప్యుటేషన్, స్వచ్ఛంద పదవీ విరమణ వంటి విషయాలను తెరపైకి తీసుకువచ్చింది. స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఆరు నెలల క్రితం బయోమెట్రిక్ విధానం అమలులోకి తెచ్చింది. తొలుత దీనిని అధికారుల వరకే అని చెప్పి, ఆ తరువాత కార్మికులను వర్తింపజేసింది. అయితే కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ప్లాంటులో సుమారు 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ఏ విభాగంలో అయితే పనిచేస్తారో అక్కడి ఇంజనీరింగ్ అధికారి హాజరు నమోదుచేస్తారు. కాంట్రాక్టర్ తరపున సూపర్‌వైజర్ కూడా రిజిస్టర్ నిర్వహిస్తారు. ఆ వివరాల ప్రకారమే వారికి వేతనాలు ఇస్తారు. అయితే ప్లాంటు లోపలకు ఎవరు వస్తున్నారు?, ... మిగతా 6వ పేజీలో

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

మహారాణిపేట: హోం గార్డు మహ్మద్ హసమ్ అనారోగ్యంతో ఈనెల 15న మృతి చెందారు. ఈ కుటుంబానికి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు,ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ. 10 వేలు మంజూరు చేసి సీపీ శంఖబ్రాత బాగ్చీ చేతుల మీదుగా అందించారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్


ప్రజాదర్బార్‌కు విచ్చేసిన అర్జీదారులు

ఆవేదనలు.. ఆక్రందనలు

- లోకేశ్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ
- భూ కబ్జాలు తదితర వాటిపై బాధితుల ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 30: విశాఖలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రేమించాలంటూ వెంట పడిన ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికిఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్ప గుండు పాలెంకు చెందిన బుద్ధి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తన కుమారుడిని అక్కడ పోలీసులు అరెస్టు చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ. అప్పలకొండ మంత్రి లోకేశ్‌ను కలసి కన్నీటిపర్యంతమయ్యారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయటం తోపాటు కొందరు చంపుతామని బెదిరిస్తున్నారని, ఈ స్థితిలో తమకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్య పేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు వేడుకున్నారు. ఆంధ్ర యూని వర్సిటీ నాటక రంగం విభాగంలో అతిథి అధ్యాపకుడిని నియమించాలని, కంప్యూటర్ సైన్స్ చదివానని, తనకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, బంగారు భూమి డెవలపర్స్ నుంచి ఇళ్లు, స్థలాలను కొనుగోలు చేయగా, వైసీపీ నేతలు వాటిని ఆక్రమించి వేధిస్తున్నట్టు పలువురు బాధితులు తెలిపారు. రాష్ట్ర సిలబస్‌లో చదువుతున్న పాఠశాల ల విద్యా ర్థులకు 9 10 తరగతుల్లో సీబీఎస్‌సీ హిందీ పాఠ్య పుస్తకాలు కాకుండా పాత పాఠ్యాంశాలనే కొనసాగించాలని నర్సీపట్నంకు చెందిన హిందీ ప్రచార సమితి సభ్యులు కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బెస్ట్ అవైలబుల్ స్కూ ల్ పథకాన్ని య థావిధిగా కొన సాగించాలని దళిత ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వీరందరిని లోకేశ్ ఆప్యాయంగా పలుకరిస్తూ వారి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సమస్యలను సంబంధిత శాఖ లకు పంపించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'దాడి' వినతి పత్రం

సీతమ్మధార: ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ డాక్టర్ దాడి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. మునిసిపల్ స్టేడియం అభివృద్ధి చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను, అండర్ గ్రౌండ్ సబ్ వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతి పత్రం సమర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 : పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నా టాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నగరంలో కాలుష్యం నిరోధానికి విరివిగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, గురుగోవింద్ సింగ్, జనపాల కృష్ణ, ముప్పాళ్ళ శ్రీకృష్ణ, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

టీబీ నిర్మూలనకు నాల్కో సంస్థ 33.6 లక్షల విరాళం

మహారాణిపేట, ఆగస్టు 30: జాతీయ స్థాయిలో టీబీ నిర్మూలనకు నాల్కో సంస్థ రూ. 33. 6 లక్షలు విరా ళంగా అందించింది. శుక్రవారం ఆ కంపెనీ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ను కలసి సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్‌కు సంబంధించి ఈ చెక్కును అందజేశారు. ఈ నిధులను ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమానికి వెచ్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాల్కో జనరల్ మేనేజర్లు ఎ.వి. సుబ్బారావు, ఉపేంద్ర మిశ్రా, వి. అనురాద తదితరులు పాల్గొన్నారు


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తు నాల్కో సంస్థ ప్రతినిధులు

స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా ప్రభాకరరావు

మహారాణిపేట, ఆగస్టు 30: స్పెషల్ బ్రాంచి అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా కింజరాపు ప్రభాకరరావుకు పదోన్నతి ల భించింది. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ప్రభాకరరావు ప్రస్తుతంఏసీపీగా పనిచేస్తున్నారు. ఆయన శుక్రవారం సిటీ స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీపీని కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అలాగే, క్రైమ్ ఏడీసీపీగా మోహనరావు నియమితులయ్యారు.



జీవో 84 రద్దు చేయాలంటూ నిరసన

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 : మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చనున్న జీవో 84ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్ల కార్డులతో నిరసన తెలిపారు. హెచ్ఎం బి.లక్ష్మి నరస, ఉపాధ్యాయులు మాణిక్యం, ఆర్.శ్రీనివాసరావు, ఎ.సునంద్, ఎం.ఎస్.విశ్వనాధ్, కిశోర్, రామలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీదేవి ఆలయంలో పూజలు

జగదాంబ కూడలి, ఆగస్టు 30: వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ వద్దనున్న శ్రీలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన పూజల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ పాల్గొన్నారు. అర్చకులు ఆయనతో పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సువర్ణశోభితం.. కన్యకాపరమేశ్వరి

- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

మహారాణిపేట, ఆగస్టు 30: వనటౌన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రావణ మాసం నాలుగో ఆఖరి శుక్రవారం పూజలు అత్యంత వైభవంగా జరి గాయి. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, పండ్ల రసాలు తదితర 108 ద్రవ్యాలతో పాటు ప్రత్యేకంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సువర్ణ వస్త్రాలతో అలంకరించి, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది మహిళలతో కుంకుమ పూజలు, లలితా సహస్ర నామపారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్ పెనుగొండ కామరాజు, ఉత్సవకమిటీ చైర్‌పర్సన్ కొల్లూరువెంకట సుజాత సభ్యులుభక్తులకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశారు.


కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన


బంగారు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శోభ

పూర్ణామార్కెట్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా ఉదయం 6గంటలకు సామూహిక కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించారు. మహిళలకు ఉచితంగా పాల్గొనే అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన శ్రావణ లక్ష్మి పూజలో ఈవో శ్రీనివాసుల రెడ్డి దతపతులు పాల్గొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం తదితర ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా జరిపారు. అమ్మవారికి పట్టుచీర, పసుపు,కుంకుమలు, గాజులు, పూలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. జేఈవో వి.రాంబాబు భక్తులకు శీఘ్రదర్శనాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.


కనకమహాలక్ష్మి ఆలయంలో పూజల్లో భక్తులు


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న మహిళలు

'భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి'

సీతంపేట, ఆగస్టు 30: ఆదర్శనీయమైన జీవితంతో భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్. కరుణరాజు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భెల్ మాజీ డిప్యూటీ మేనేజర్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, సామాజిక కార్యకర్త తెన్నేటి పద్మావతి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాకారాలు దాటి.. ఆకాశం తాకిన తెన్నేటి పద్మావతి అనే పుస్తకాన్ని కరుణరాజు, 'మద్యపాన వ్యసనం విముక్తి' అనే పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్యే పి.రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ పద్మావతి ఎంతో క్రమశిక్షణ, నిబద్ధతతో జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోసెల విజయ్‌చందర్, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వీరయ్య, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఆచార్య శ్రీనివాస్, అంబేద్కర్ మెమోరియాల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బి.కళ్యాణ్‌రావు, జె.వి. ప్రభాకర్, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

జ్వరాలపై జాగ్రత్త వహించాలి: డీఎంహెచ్‌వో

సీతంపేట, ఆగస్టు 30: జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు సూచించారు. మౌలాళి పంజా జంక్షన్ బురుజుపేట సచివాలయం పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి పరిధిలోని నమోదైన డెంగ్యూ బాధితురాలు అనూషను కలిసి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలమైన కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భనలో వైద్యులు బి.ఉమావతి, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పిలుపు నిచ్చారు. చైతన్యనగర్, కనకమ్మవారి తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

మురళీనగర్; సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలంతా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని51వవార్డు కార్పొరేటర్ రెయ్యివెంకటరమణ సూచించారు. మాదవదార కళింగనగర్‌లో శానిటేషన్, మలేరియా సిబ్బంది ఫ్రై డే- డ్రై డేపై అవగాహన చేపట్టారు.

అక్కయ్యపాలెం: ప్రజల సహకారంతోనే దోమల నివారణ సాధ్యమని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ సిబ్బంది 27, 42, 44 వార్డుల్లో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, మలేరియా సూపర్‌వైజర్ శివ, వార్డు టీడీపీ నేతలు అల్లూరి సత్యనారాయణరెడ్డి లక్ష్మీ శివప్రసాద్, సింహాచలం, గురునాద్, కనకారావు తదితరులు పాల్గొన్నారు. 42వ వార్డు నాగేశ్వరరావు గ్యాస్ ఏజెన్సీ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొరబాబు ఆధ్వర్యంలో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా జ్వరం తో బాధపడుతున్న ఒక కుటుంబాన్ని జీవీఎంసీ ఎస్ఎస్ జనార్దనరావు పరామర్శించి వారికి సూచనలు ఇచ్చారు.మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీను, టీడీపీ నేతలు కన్నం వెంకట రమణారావు, ము క్కి రామకృష్ణ, బీజేపీనేతలు గురుగోవింద్ సింగ్, సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలో జ్వరాలపై అవగాహన కల్పించారు


నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మళ్లీ భీమిలి రిజిస్ట్రార్‌గా తులసీదాస్

- కోర్టు ఆదేశాలతో విధుల్లోకి..

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా వి. తులసీదాస్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఈ నెల 12న ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పద్మనాభం మండలం బి.తాళ్లవలసలో రికార్డులు సరిగ్గా లేని ఇనాము భూముల రిజిస్ట్రేషన్లకు వైసీపీకి చెందిన నేతలు 38 డాక్యుమెంట్లు సమర్పించగా, వాటికి సంబంధించిన రికార్డుల్లో ఆ మండల తహసీల్దార్ డిజిటల్ సంతకం లేకపోవడంతో సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ వాటిని చాలారోజులు పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో తులసీదాస్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ స్థానంలో ఆడిట్ విభాగంలోని గోపీని డిప్యుటేషన్‌పై అక్కడికి పంపించారు. అయితే, సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ తనను అకారణంగా సస్పెండ్ చేశారంటూ హైకోర్టును ఆశ్రయించారు. తన చర్యల వల్ల ప్రభుత్వ భూములకు ఎటువంటి నష్టం జరగలేదని, తాను రిజిస్ట్రేషన్ చేయలేదని, కేవలం పెండింగ్ మాత్రమే ఉంచానని కోర్టుకు వివరించారు. దాంతో ఆయన్ను విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తులసీదాస్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. దీనిపై ప్రభుత్వం హైకోర్టులో కౌంటర్ ఎలా వేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 30: వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, తిరుపతి, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగించినట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583) సెప్టెంబరు రెండు నుంచి నవంబరు 25 వరకు (ప్రతి సోమవారం), తిరుగు ప్రయాణంలోని తిరుపతి- విశాఖ ప్రత్యేక రైలు (08584) సెప్టెంబరు మూడు నుంచి నవంబరు 26వ తేదీ వరకు (ప్రతి మంగళవారం) అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (08579) సెప్టెంబరు4 నుంచి నవంబరు 27 వరకు (ప్రతి బుధవారం), తిరిగి సికింద్రాబాద్- విశాఖప్రత్యేక రైలు (08580) సెప్టెంబరు5 నుంచి నవంబరు 28 వరకు (ప్రతి గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ రైలు సెప్టెంబరు ఏడు నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి 08558 నంబరు గల రైలు సెప్టెంబరు ఎనిమిది నుంచి నవంబరు 31 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు స్టేషన్‌లో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-తిరుపతి/ కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రయోగాత్మకంగా శుక్రవారం (30వ తేదీ) నుంచి నందలూరు స్టేషన్‌లో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పించామని సీనియర్ డీసీఎం తెలిపారు.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

... 5వ పేజీ తరువాయి

నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగిందని, కష్టపడే వారికి పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బదిలీల్లో ముఖ్యమంత్రి పక్కాగా ఉంటూ సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారన్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బాగా పనిచేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారని అభినందించారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు యత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు,విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజ వర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్‌కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్,పాల్గొన్నారు.

ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

... 5వ పేజీ తరువాయి

వచ్చి వంద రోజులు కూడా కాలేదని, అన్నీ తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నామని, త్వరలో విద్యాభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించి అందరికీ పంపిస్తామన్నారు. ఒకేసారి అంతా ఇంగ్లీష్ చేసేస్తున్నామంటే పిల్లలు ఇబ్బంది పడతారన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజిని క్రమేణా చేర్చుతామన్నారు. వచ్చే ఐదేళ్లలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నామని, అందరూ బాధ్యతగా పనిచేసి సహకరించాలని కోరారు. 'స్కూల్ మెయింటెనెన్స్ ఎప్పుడూ ఇట్లానే చేయండి. ఈసారి అధికారులకు చెప్పి వచ్చాను. నేను వస్తున్నానని బాగా చేసి ఉండొచ్చు. నెక్స్ట్ టైమ్ ఎవరికీ చెప్పకుండా సడన్‌గా నేనొక్కడినే వస్తాను, ఈ విషయాన్ని కారులో మా అధికారులకు కూడా చెప్పా..' అని అన్నారు. దాంతో అందరూ వెల్‌కమ్ సార్ అని అన్నారు. ఈ దశలో సిబ్బంది చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామనగా, డిఫరెంట్ పీపుల్, డిఫరెంట్ ప్రాబ్లమ్స్..అన్నీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌ను చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ కలిసారు. తమ కంపెనీ కేజీబీవీకి సీఎస్ఆర్‌లో చేస్తున్న సహకారాన్ని వివరించారు. ఓకే గుడ్ అంటూ, తర్వాత మరోసారి మాట్లాడదామని మంత్రి అన్నారు.

ఉక్కులో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

ఎవరు బయటకు వెళుతున్నారో తెలియడం లేదని, వచ్చేవారు, వెళ్లేవారు మెయిన్ గేటులో బయోమెట్రిక్ వేయాలని యాజమాన్యం ఆదేశించింది. ఈ విధానాన్ని మార్చి నెల నుంచి అమలులోకి తీసుకువచ్చింది. దానిని చాలామంది సీరియస్‌గా తీసుకోలేదు. కాంట్రాక్టు కార్మికులు చాలామంది పేర్లు నమోదు చేసుకోలేదు. ఆధార్ సమస్య వల్ల కొందరు పట్టించుకోలేదు. విధులకు వెళ్లి, తిరిగి వస్తున్నప్పుడు బయోమెట్రిక్ వేసేవారుకాదు. మరికొందరు ఇతర గేట్ల నుంచి వెళ్లిపోయేవారు. కాంట్రాక్టు కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇటీవల మే నెల వేతనాలు ఇవ్వాలని హాజరు పరిశీలించారు. మెయిన్‌గేటులో కాంట్రాక్టు కార్మికుల హాజరు తక్కువ ఉందని, విభాగాల్లో హాజరు ఎక్కువ ఉందని, దానికి కారణాలు ఏమిటో చెప్పాలంటూ వారం క్రితం ఇంజనీరింగ్ విభాగాల్లో 199 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అంటే వారు ప్లాంటులోకి రాకపోయినా హాజరు వేశారని పరోక్షంగా చెబుతూ దానికి వివరణ కోరింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చే హాజరునే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

యాజమాన్యం మెయిన్‌గేటులో బయోమెట్రిక్‌ను హాజరుగా పరిగణిస్తామని ప్రకటించలేదు. ఆ ప్రకారం కాంట్రాక్టర్లతో ఒప్పందమూ చేయలేదు. ఇప్పుడు మెయిన్ గేటు హాజరు ప్రకారమే వేతనాలు ఇస్తామని జూన్, జూలై, ఆగస్టు నెలలకు బిల్లులు తయారుచేయడంతో కాంట్రాక్టు కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. తమకు మెయిన్ గేటు తప్పనిసరి అని చెప్పలేదని, దానిని ఎలా పరిగణనలోకి తీసుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. ఉక్కు మంత్రిత్వ శాఖ బయోమెట్రిక్ అమలు వల్ల ఎంత మిగులు కనిపించిందో చెప్పాలని కోరడం వల్లనే యాజమాన్యం ఇప్పుడు ఈ తప్పుడు లెక్కలు వేస్తోందని ఆరోపిస్తున్నారు. దీనిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయాన్ని వేలాది మంది కార్మికులు ముట్టడించారు. తమకు విభాగాల్లో రిజిస్టర్ల ప్రకారమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ పేరుతో వేతనాల్లో కోత వేస్తే సహించబోమని స్పష్టంచేశారు. యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని వర్క్స్ సీజీఎం శ్రీధర్ హామీ ఇచ్చారు.

మెయిన్ గేటులో బయోమెట్రిక్ ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఇస్తామని యాజమాన్యం స్పష్టంగా చెప్పకపోవడం వల్లనే ఈ వివాదం చెలరేగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు యాజమాన్యం వారికి అధికారికంగా హాజరు చూపిస్తే, నిర్ణీత కాలం తరువాత వారిని పర్మినెంట్ కార్మికులుగా పరిగణించాల్సి ఉంటుందని, అందుకే మధ్యలో కాంట్రాక్టర్‌ని పెట్టి, వారితో హాజరు వేయిస్తారని, ఈ చిన్న విషయం కూడా గుర్తించకుండా యాజమాన్యం పెద్ద వివాదానికి కారణమైందని వాదనలు వినిపిస్తున్నాయి.

పనిదినాల కోతకు కొత్త నిర్ణయం

ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పనిదినాలు తగ్గించడానికి నిర్ణయం తీసుకున్నట్టు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్మికుల్లో 30 శాతం మందిని తగ్గించాలని ఆదేశించారని, దానికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారని చెబుతున్నారు. ఈ మేరకు కీలక విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు నెలకు తప్పనిసరిగా ఎనిమిది రోజులు సెలవు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంత ప్రాధాన్యం లేని విభాగాల్లో రోజు తప్పించి రోజు విధుల్లోకి రావాలని, నెలకు 15 రోజుల వేతనమే ఇస్తామని సమాచారం పంపారు. దీనిపై కూడా కాంట్రాక్టు కార్మికులు మండిపడుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం

కూర్మన్నపాలెం, ఆగస్టు 30: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం సాధ్యమని 86వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. పెదయాతపాలెంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్నారు.

వేపగుంట: ప్రశాంతినగర్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై శానిటరీ, మలేరియా విభాగం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచించారు. దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు.

గాజువాక: దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్ స్టాలిన్ పేర్కొన్నారు. పాతకర్నవానిపాలెంలో ప్రజలకుఅవగాహన కల్పించారు.

పెందుర్తిరూరల్: ఫ్రైడే డ్రైడే పాటించాలని 95వ వార్డు కార్పొరేటరు ముమ్మన దేముడు సూచించారు. పాపయ్యరాజుపాలెంలో అవగాహన కల్పించారు.

అగనంపూడి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. కేఎస్ఎన్‌రెడ్డి నగర్‌లో జెడ్పీ సన్యాసినాయుడుతో కలిసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

మల్కాపురం: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టీడీపీ నేత మజ్జి సోమేష్ పేర్కొన్నారు. మల్కాపురంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే నిర్వహించారు. ఉప్పరకాలనీలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నేడు ఈపీఎస్ పెన్షనర్ల సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 30: ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం స్టీల్‌ప్లాంట్ సీ భవన్‌లో నిర్వహించనున్నట్టు పెన్షనర్ల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో వివిధ అంశాలపై చర్చ, తీర్మానాలు చేస్తామన్నారు.

110 మందికి దంత వైద్య పరీక్షలు

పెందుర్తి, ఆగస్టు 30: గోశాల పరిధిలో సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గీతం ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి దంత వైద్య పరీక్షలు చేశారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు మనోజ్ సందీప్,గణేశ్, వెంకట్ ప్రణీత్ పాల్గొన్నారు

బాలకృష్ణ అభిమానుల పూజలు

పెందుర్తి, ఆగస్టు 30: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం సందర్భంగా జై బాలయ్య టీం పెందుర్తి శాఖ అధ్యక్షుడు వేగి వాసు ఆధ్వర్యంలో సింహాచలం తొలి పావంచా వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలకృష్ణ ప్రజలకు అనేక సేవలందిస్తున్నారని కొనియాడారు. షేక్ సాహుల్,గుండాపు రమణ, సతీశ్ లెజెండ్, జంగాలిపాలెం శ్రీను కిరణ్, కొమర పైడిరాజు పాల్గొన్నారు.

పవన్ పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు

ఆటోనగర్, ఆగస్టు 30: జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆపార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు తెలిపారు. శ్రీనగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసైనికులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 2న నియోజకవర్గంలో పార్కులు, ప్రధాన రహదారులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేల మొక్కలను నాటాలన్నారు. శ్రమదానాలు, స్వచ్ఛభారత్, రక్తదానం, వస్త్రదానాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ డి.గోవిందరెడ్డి, జి.అప్పారావు, కనకారావు, శ్రీను, వెంకటరావు, మురళీదేవి, ప్రియదర్శిని, కనకరాజు, సోమశేఖర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి చర్యలు తీసుకోండి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 30: స్టీల్‌ప్లాంట్‌లో యువ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌ను కోరారు. శుక్రవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంట్ ప్రగతికి తీసుకునే చర్యలకు ఉద్యోగుల తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాటూరి రాము, అశోక్, తారక్, సీతయ్య, రమేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 34, దొండకాయలు 22, బంగాళదుంపలు 29, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 36, అల్లం 120, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి 245, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 75, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్/కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	88
ఫారం ధర	--	108
విత్ స్కిన్	--	186
స్కిన్‌లెస్	--	196

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



నౌసేనా బాగ్ వద్ద రహదారిపై నిలిచిన వర్షం నీరు



మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లోకి వరద నీరు



సింథియా న్యూ కాలనీలో ఇలా...

ఎడతెగని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

మల్కాపురం, ఆగస్టు 30: పారిశ్రామిక ప్రాంతంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. మల్కాపురం పోలీసుస్టేషన్ నుంచి నౌసేనాబాగ్ గేటు వరకు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు అవస్థలు పడ్డారు. హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నీరు చేరింది. కంపెనీలోకి వెళ్లేందుకు ఇక్కట్లు ఎదురయ్యాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ప్రధాన రహదారికి అనుసంధానంగా కాలువను నిర్మించకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. వర్షాలతో ములగాడ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అప్రమతమయ్యారు. మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయం అవసరమైన వారు జి.శ్రీదేవి7997003784, ఎం.ఝాన్సీ 8885151262లకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఆర్.రామకృష్ణ 7780166893, జె.పరమేష్ 7382290474లకు రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ఫోన్‌చేయవచ్చని తహసీల్దార్ తెలిపారు.

నీటమునిగిన రహదారులు

సింథియా: భారీ వర్షానికి సింధియా ప్రాంతంలోని రోడ్లు, కాల్వలు నీట మునిగాయి. మెయిన్‌రోడ్డుపై మోకాలి లోతున నీరు ప్రవహించింది. స్థానికులు బయటకు రాలేని పరిస్థితి ఎదురయింది. మల్కాపురం పోలీస్ స్టేషన్‌లోకి వర్షంనీరు చొరబడింది. ఇక్కడ డ్రైనేజీని ఆధునికీకరించేందుకు వీలుగా పనులు చేపడుతున్న కాంట్రాక్టరు కాలువకు అడ్డుకట్ట వేశారు. పనులు పూర్తైనా తొలగించకపోడంతో మురుగు నీరు రోడ్డుపైకి పొంగి ఇళ్లలోకి చొరబడింది.



మల్కాపురం ప్రధాన రహదారిపై బురద

గాజువాకలో భారీ వర్షం

గాజువాక: గాజువాకలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత రెండు మూడు రోజులు తెరపివ్వకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. చాలాచోట్ల గోతులతో అధ్వానంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ గోయ్యి ఉందో తెలియక భయపడుతూ ముందుకు సాగాల్సి వస్తోందని వాపోతున్నారు.

కొండవాలులో భయం భయం



దయాళ్‌నగర్ కొండ వాలులో నివాసాలు

పెదగంట్యాడ: ఎడతెగని వర్షాలతో కొండల వాలు ప్రాంత వాసుల్లో భయాందోళన నెలకొంది. కొండ చరియలు విరిగిపడతాయని, వర్షానికి మట్టి కరిగి కొండరాళ్లు ఇళ్లను తాకుతాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలోకుండపోత వర్షాలతో నిద్ర పట్టడం లేదని వాపోతున్నారు. పెదగంట్యాడ పరిధిలోని దయాళ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, టీజీఆర్ నగర్, యాతపాలెం, వాంబే కాలనీలు కొండ వాలు ప్రాంతాల్లోనే ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు మట్టి, రాళ్లతో నీరు దిగువకు రావడం,పెద్ద రాళ్లు ఇళ్లగోడలకు ఢీ కొనడం జరుగుతోంది. దీంతో తీవ్ర భయాందోళనలో నివాసితులున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ పర్యటన

గోపాలపట్నం, ఆగస్టు 30: గ్రేటర్ 89వ వారులోని లోతట్టు ప్రాంతాల్లో గ్రేటర్ కమిషనర్ పి.సంపత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శుక్రవారం పర్యటించారు. కొత్తపాలెం శిరు నరవ ప్రధాన రహదారిలో ముంపు సమస్యను కమిషనర్‌కు ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టక ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీరు రహదారిపైకి చేరి ఈ మార్గంలో రాకపోకలు సాగించే సుమారు పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇటీవల చంద్రనగర్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌వేలో వర్షం నీరుచేరుతోందని, వరదనీటిని పంపింగ్ చేసి బయటకు పంపేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ హేమవతి, కార్పొరేటర్లు మొల్లిముత్యాల నాయుడు, బొమ్మిడి రమణ, వార్డు నాయకులు పాల్గొన్నారు.



సమస్యను కమిషనర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు



విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న డాక్‌యార్డు ఉద్యోగులు

పెందుర్తి, ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏకీకృత (యూపీఎస్) పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్‌లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ మాట్లాడారు. యూపీఎస్ స్కీం కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల ప్రయోజనం కోసమే కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దీనిని రద్దు చేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అప్పారావు, నాగమణి, అప్పలరాము, పద్మావతి, సత్యనారాయణ, ఎర్రినాయుడు పాల్గొన్నారు,

పాత పెన్షన్ అమలు చేయాలి

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన యూపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరుతూ నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు డాక్‌యార్డు విజయనగర్ గేటు వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అరుణ్‌కుమారి మాట్లాడుతూ, ఎనిమిదో వేతన సంఘం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన శనివారం కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, వర్కర్స్ కమిటీ సభ్యులు, జేసీఎం సభ్యులు, సొసైటీ డైరెక్టర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



డెయిరీ కాలనీలో మొక్క నాటుతున్న జెడ్పీ, కార్పొరేటర్



కొత్తపాలెం హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం



పెందుర్తిలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ పీలా

సందడిగా వన మహోత్సవం

పెదగంట్యాడ, ఆగస్టు 30: కాలుష్య నివారణకు, భూగర్భ జలాల నిల్వల పెరుగుదలకు విస్తారంగా మొక్కలు నాటి, పరిరక్షించాలని కార్పొరేటర్ గందం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. డెయిరీకాలనీ పార్కులో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన మాట్లాడుతూ విపరీతంగా బోరు బావుల తవ్వకాలతో భూగర్భ జలాలు శరవేగంగా తగ్గిపోతున్నాయని, దీనివల్ల భవిష్యత్తు తరాలకు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మొక్కలను విరివిగా పెంచాలన్నారు. అనంతరం గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా విస్తారంగా మొక్కలు నాటాల్సి అవసరం ఉందన్నారు. 76వ వార్డు పరిధిలో 5,000 మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఎంహెచ్‌ఓ కిరణ్, హార్టీకల్చర్ అధికారి పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు డెయిరీకాలనీ పార్కులో మొక్కలు నాటారు.

గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో...

గోపాలపట్నం: వన మహోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గ్రేటర్ కమిషనర్ పి.సంపత్ కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు, పలువురు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మొక్కలు నాటారు.

పెందుర్తిలో మొక్కలు నాటిన పీలా

పెందుర్తి: పెందుర్తిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శుక్రవారం జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రత్యేక వేదికపై అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతం

సింహాచలం, ఆగస్టు 30: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు. ముందుగా అప్పన్న ఆలయంలో ప్రభా ఆరాధనలు పూర్తిచేసిన తరువాత అమ్మవారి ప్రత్యేక విగ్రహాన్ని క్షేత్ర పాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయానికి సమీపంలోని యాత్రిక్ సదన్‌లో ఏర్పాటుచేసిన వేదికపై అధిష్టింపజేశారు. వ్రతంలో పాల్గొన్న వారికి దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది పూజా సామగ్రి అందజేశారు. తరువాత పండితులు శాస్త్రోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలను సమర్పించారు. అనంతరం లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ మహిళలతో అమ్మవారి ప్రతిమకు కుంకుమార్చన చేయించారు. పూజ తరువాత పండితులు భక్తులందరికీ వేదశీర్వచనాలీయగా, అధికారులు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. వ్రత ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

సింహాచలం డిపోలో ఆర్టీసీ కార్మికుల నిరసన



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ కార్మిక సంఘం సభ్యులు

వేపగుంట, ఆగస్టు 30: సింహాచలం ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిగా ఎన్ఎంయూ జిల్లా చైర్మన్ ప్రాన్ మాట్లాడుతూ ట్రెజరీ అధికారులు ఏ పీపీటీడీ కార్మికులకు నైట్‌అవుట్ అలవెన్స్‌లు మంజూరు చేయలేమని చెప్పడం శోచనీయమన్నారు. ఇప్పటికే కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం విఫలమైందన్నారు. అలాగే, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏరియర్స్ చెల్లింపులో కొందరు అధికారులు కార్మికులను ఇబ్బందిలోను చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డి.ఎ.నాయుడు, జె.ఎస్.ఎన్.రాజు, టి.ఎన్.రావు, డెలిగేట్స్, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణపై ధర్నాలు రేపు



మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, ఆగస్టు 30: ఉక్కు ప్రైవేటీకరణ రద్దు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతూ స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో వడ్లపూడి, అగనంపూడి, పెదగంట్యాడల్లో సెప్టెంబరు 1న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్నా నిర్వహించనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె. అయోధ్యరామ్ తెలిపారు. శుక్రవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న సీఐటీయూ కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. మరోనేత ఎస్.రామారావు మాట్లాడుతూ ఇటీవల ఉక్కు కర్మాగారానికి పర్యటనకు విచ్చేసిన కేంద్ర ఉక్కు మంత్రి కు మారస్వామికి ఉక్కు పరిస్థితిని విన్నవించడంతో 45 రోజులు సమయం కావాలని మంత్రి కోరారన్నారు. యు.రామస్వామి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు.

రక్షణ గోడ నిర్మించాలని వినతి

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 30: జీవీఎంసీ 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని కొండవాలు ప్రాంతంలో అభివృద్ధి పనులతోపాటు రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్పొరేటర్ బొమ్మిడిరమణకు వినతిపత్రం అందజేశారు. కొండవాలు వాసుల సమస్యలు అధికారులకు తెలిపామని, రక్షణ గోడ నిర్మాణం, కాలువల పనులు పూర్తికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అగనంపూడి, ఆగస్టు 30: గత నాలుగు నెలలుగా బకాయి పడిన వేతనాలను చెల్లించాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ భారతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సెప్టెంబరు 15 నాటికి వేతనాలు చెల్లించకుంటే విధులకు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మం గ, చిన్న, పద్మ, కిరణ్‌కుమార్, శ్రావణి, సరోజిని, సంధ్య, రామయ్య, వరలక్ష్మి, కాంతం, ఝాన్సీ సావిత్రి, సూరిబాబు, లక్ష్మి, పైడిమ్మ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి, ఆగస్టు 30: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదముడక సంపత్ వినాయక ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన కర పత్రాలను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కమిటీ ప్రతినిదులు మోటూరి వెంకటరమణ, మడుగుల నరసింగరావు, మజ్జి శ్రీనివాసరావు, విందుల నారాయణరావు, బలిరెడ్డి సత్యనారాయణ, అప్పలరాజు, జగ్గారావు, చిన్నారావు, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరానికి రాజ్యసభ స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న అధికారులు

గోపాలపట్నం, ఆగస్టు 30: దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా రాజ్యసభ స్టాండింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. చెన్నై నుంచి విశాఖ చేరుకున్న బృందానికి పలువురు అధికారులు స్వాగతం పలికారు. సుజిత్‌కుమార్ ఛైర్మన్‌గా ఉన్న కమిటీలో సుమిత్ర బాల్మిక్, రాజేంద్ర గెహ్లాట్, డాక్టర్ ధర్మస్థల వీరేంద్ర హెగ్డే, నాబమ్ రెబియా, కార్తికేయ శర్మ, అరుణ్‌సింగ్, తిరుచ్చి శివ సభ్యులు. కమిటీ రాత్రి నగరంలో బస చేసి, శనివారం ఉదయం పది గంటలకు విశాఖపట్నం పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, ఏపీ ఎండీసీ, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమావేశమై వారినుంచి పిటీషన్లు స్వీకరిస్తుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు మెడ్‌టెక్‌జోన్‌ను సందర్శించి సంస్థ ప్రతినిధులతో సమావేశమవుతుంది. కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్ ఏసియా బయోమెడికల్స్, మోల్బయో డయోగ్నోస్టిక్స్ సంస్థల ప్రతినిదులు, అధికారులతో సమావేశమై పిటీషన్లు స్వీకరిస్తుంది. రాత్రి నగరంలోనే బస చేసి ఆదివారం మధ్యాహ్నం 12.35 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి న్యూఢిల్లీ వెళ్తుంది.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

మహారాణిపేట: హోం గార్డు మహ్మద్ హసమ్ అనారోగ్యంతో ఈనెల 15న మృతి చెందారు. ఈ కుటుంబానికి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10 వేలు,ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ. 10 వేలు మంజూరు చేసి సీపీ శంఖబ్రాత బాగ్చీ చేతుల మీదుగా అందించారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్



ప్రజాదర్బార్‌కు విచ్చేసిన అర్జీదారులు

ఆవేదనలు.. ఆక్రందనలు

- లోకేశ్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ
- భూ కబ్జాలు

తదితర వాటిపై బాధితుల ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 30: విశాఖలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రేమించాలంటూ వెంట పడిన ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికిఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్పు గుండుపాలెంకు చెందిన బుద్ధి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తన కుమారుడిని అక్కడ పోలీసులు అరెస్టు చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ. అప్పలకొండ మంత్రి లోకేశ్‌ను కలసి కన్నీటిపర్యంతమయ్యారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయటం తోపాటు కొందరు చంపుతామని బెదిరిస్తున్నారని, ఈ స్థితిలో తమకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్య పేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు వేడుకున్నారు. ఆంధ్ర యూని వర్సిటీ నాటక రంగం విభాగంలో అతిథి అధ్యాపకుడిని నియమించాలని, కంప్యూటర్ సైన్స్ చదివానని, తనకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, బంగారు భూమి డెవలపర్స్ నుంచి ఇళ్లు, స్థలాలను కొనుగోలు చేయగా, వైసీపీ నేతలు వాటిని ఆక్రమించి వేధిస్తున్నట్టు పలువురు బాధితులు తెలిపారు. రాష్ట్ర సిలబస్‌లో చదువుతున్న పాఠశాలల విద్యా ర్థులకు 9 10 తరగతుల్లో సీబీఎస్‌సీ హిందీ పాఠ్య పుస్తకాలు కాకుండా పాత పాఠ్యాంశాలనే కొనసాగించాలని నర్సీపట్నంకు చెందిన హిందీ ప్రచార సమితి సభ్యులు కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బెస్ట్ అవైలబుల్ స్కూ ల్ పథకాన్ని య థావిధిగా కొన సాగించాలని దళిత ప్రతినిదులు విజ్ఞప్తి చేశారు. వీరందరిని లోకేశ్ ఆప్యాయంగా పలుకరిస్తూ వారి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సమస్యలను సంబంధిత శాఖ లకు పంపించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'దాడి' వినతి పత్రం

సీతమ్మధార: ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ డాక్టర్ దాడి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. మునిసిపల్ స్టేడియం అభివృద్ధి చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను, అండర్ గ్రౌండ్ సబ్ వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతి పత్రం సమర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 : పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నా టాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నగరంలో కాలుష్యం నిరోధానికి విరివిగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, గురుగోవింద్ సింగ్, జనపాల కృష్ణ, ముప్పాళ్ల శ్రీకృష్ణ, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

టీబీ నిర్మూలనకు నాల్కో సంస్థ 33.6 లక్షల విరాళం

మహారాణిపేట, ఆగస్టు 30: జాతీయ స్థాయిలో టీబీ నిర్మూలనకు నాల్కో సంస్థ రూ. 33. 6 లక్షలు విరా ళంగా అందించింది. శుక్రవారం ఆ కంపెనీ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ను కలసి సంస్థ సీఎస్‌ఆర్ ఫండ్స్‌కు సంబంధించి ఈ చెక్కును అందజేశారు. ఈ నిధులను ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమానికి వెచ్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాల్కో జనరల్ మేనేజర్లు ఎ.వి. సుబ్బారావు, ఉపేంద్ర మిశ్రా, వి. అనురాధ తదితరులు పాల్గొన్నారు



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తు నాల్కో సంస్థ ప్రతినిధులు

శ్రీలక్ష్మీదేవి ఆలయంలో పూజలు

జగదాంబ కూడలి, ఆగస్టు 30: వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ వద్దనున్న శ్రీలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన పూజల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ పాల్గొన్నారు. అర్చకులు ఆయనతో పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా ప్రభాకరరావు

మహారాణిపేట, ఆగస్టు 30: స్పెషల్ బ్రాంచి అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా కింజరాపు ప్రభాకరరావుకు పదోన్నతి ల భించింది. 1991 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ప్రభాకరరావు ప్రస్తుతంఏసీపీగా పనిచేస్తున్నారు. ఆయన శుక్రవారం సిటీ స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీపీని కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అలాగే, క్రైమ్ ఏడీసీపీగా మోహనరావు నియమితులయ్యారు.



జీవో 84 రద్దు చేయాలంటూ నిరసన

అక్కయ్యపాలెం, ఆగస్టు 30 : మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చనున్న జీవో 84ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్ల కార్డులతో నిరసన తెలిపారు. హెచ్‌ఎం బి.లక్ష్మి నరస, ఉపాధ్యాయులు మాణిక్యం, ఆర్.శ్రీనివాసరావు, ఎ.సునంద్, ఎం.ఎస్.విశ్వనాథ్, కిశోర్, రామలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

సువర్ణశోభితం.. కన్యకాపరమేశ్వరి

- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

మహారాణిపేట, ఆగస్టు 30: వనటౌన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రావణ మాసం నాలుగో ఆఖరి శుక్రవారం పూజలు అత్యంత వైభవంగా జరి గాయి. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, పండ్ల రసాలు తదితర 108 ద్రవ్యాలతో పాటు ప్రత్యేకంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సువర్ణ వస్త్రాలతో అలంకరించి, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది మహిళలతో కుంకుమ పూజలు, లలితా సహస్ర నామపారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్ పెనుగొండ కామరాజు, ఉత్సవకమిటీ చైర్‌పర్సన్ కొల్లూరువెంకట సుజాత సభ్యులుభక్తులకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన



బంగారు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శోభ

పూర్ణామార్కెట్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా ఉదయం 6గంటలకు సామూహిక కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించారు. మహిళలకు ఉచితంగా పాల్గొనే అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన శ్రావణ లక్ష్మి పూజలో ఈవో శ్రీనివాసుల రెడ్డి దతపతులు పాల్గొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం తదితర ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా జరిపారు. అమ్మవారికి పట్టుచీర, పసుపు,కుంకుమలు, గాజులు, పూలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. జేఈవో వి.రాంబాబు భక్తులకు శీఘ్రదర్శనాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.



కనకమహాలక్ష్మి ఆలయంలో పూజల్లో భక్తులు



కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న మహిళలు

'భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి'

సీతంపేట, ఆగస్టు 30: ఆదర్శనీయమైన జీవితంతో భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్. కరుణరాజు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భెల్ మాజీ డిప్యూటీ మేనేజర్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, సామాజిక కార్యకర్త తెన్నేటి పద్మావతి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాకారాలు దాటి.. ఆకాశం తాకిన తెన్నేటి పద్మావతి అనే పుస్తకాన్ని కరుణరాజు, 'మద్యపాన వ్యసనం విముక్తి' అనే పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్యే పి.రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ పద్మావతి ఎంతో క్రమశిక్షణ, నిబద్ధతతో జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోసెల విజయ్‌చందర్, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వీరయ్య, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఆచార్య శ్రీనివాస్, అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బి.కళ్యాణ్‌రావు, జె.వి. ప్రభాకర్, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

జ్వరాలపై జాగ్రత్త వహించాలి: డీఎంహెచ్‌వో

సీతంపేట, ఆగస్టు 30: జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు సూచించారు. మౌలాళి పంజా జంక్షన్ బురుజుపేట సచివాలయం పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంను శు క్రవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి పరిధిలోని నమోదైన డెంగ్యూ బాధితురాలు అనూషను కలిసి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలమైన కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్శనలో వైద్యులు బి.ఉమావతి, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పిలుపు నిచ్చారు. చైతన్యనగర్, కనకమ్మవారి తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు.

మురళీనగర్; సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలంతా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని51వవార్డు కార్పొరేటర్ రెయ్యివెంకటరమణ సూచించారు. మాధవధార కళింగనగర్‌లో శానిటేషన్, మలేరియా సిబ్బంది ఫ్రై డే- డ్రై డేపై అవగాహన చేపట్టారు.

అక్కయ్యపాలెం: ప్రజల సహకారంతోనే దోమల నివారణ సాధ్యమని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ సిబ్బంది 27, 42, 44 వార్డుల్లో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, మలేరియా సూపర్‌వైజర్ శివ, వార్డు టీడీపీ నేతలు అల్లూరి సత్యనారాయణరెడ్డి లక్ష్మీ శివప్రసాద్, సింహాచలం, గురునాద్, కనకారావు తదితరులు పాల్గొన్నారు. 42వ వార్డు నాగేశ్వరరావు గ్యాస్ ఏజెన్సీ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొరబాబు ఆధ్వర్యంలో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా జ్వరం తో బాధపడుతున్న ఒక కుటుంబాన్ని జీవీఎంసీ ఎస్‌ఎస్ జనార్దనరావు పరామర్శించి వారికి సూచనలు ఇచ్చారు.మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీను, టీడీపీ నేతలు కన్నం వెంకట రమణారావు, ము క్కి రామకృష్ణ, బీజేపీనేతలు గురుగోవింద్ సింగ్, సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలో జ్వరాలపై అవగాహన కల్పించారు



నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మళ్లీ భీమిలి రిజిస్ట్రార్‌గా తులసీదాస్

- కోర్టు ఆదేశాలతో విధుల్లోకి..

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా వి. తులసీదాస్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఈ నెల 12న ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పద్మనాభం మండలం బి.తాళ్లవలసలో రికార్డులు సరిగ్గా లేని ఇనాము భూముల రిజిస్ట్రేషన్లకు వైసీపీకి చెందిన నేతలు 38 డాక్యుమెంట్లు సమర్పించగా, వాటికి సంబంధించిన రికార్డుల్లో ఆ మండల తహసీల్దార్ డిజిటల్ సంతకం లేకపోవడంతో సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ వాటిని చాలారోజులు పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో తులసీదాస్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ స్థానంలో ఆడిట్ విభాగంలోని గోపీని డిప్యుటేషన్‌పై అక్కడికి పంపించారు. అయితే, సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ తనను అకారణంగా సస్పెండ్ చేశారంటూ హైకోర్టును ఆశ్రయించారు. తన చర్యల వల్ల ప్రభుత్వ భూములకు ఎటువంటి నష్టం జరగలేదని, తాను రిజిస్ట్రేషన్ చేయలేదని, కేవలం పెండింగ్ మాత్రమే ఉంచానని కోర్టుకు వివరించారు. దాంతో ఆయన్ను విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తులసీదాస్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. దీనిపై ప్రభుత్వం హైకోర్టులో కౌంటర్ ఎలా వేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 30: వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, తిరుపతి, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగించినట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583) సెప్టెంబరు రెండు నుంచి నవంబరు 25 వరకు (ప్రతి సోమవారం), తిరుగు ప్రయాణంలోని తిరుపతి- విశాఖ ప్రత్యేక రైలు (08584) సెప్టెంబరు మూడు నుంచి నవంబరు 26వ తేదీ వరకు (ప్రతి మంగళవారం) అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (08579) సెప్టెంబరు4 నుంచి నవంబరు 27 వరకు (ప్రతి బుధవారం), తిరిగి సికింద్రాబాద్- విశాఖప్రత్యేక రైలు (08580) సెప్టెంబరు5 నుంచి నవంబరు 28 వరకు (ప్రతి గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ రైలు సెప్టెంబరు ఏడు నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి 08558 నంబరు గల రైలు సెప్టెంబరు ఎనిమిది నుంచి నవంబరు 31 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు స్టేషన్‌లో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-తిరుపతి/ కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రయోగాత్మకంగా శుక్రవారం (30వ తేదీ) నుంచి నందలూరు స్టేషన్‌లో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పించామని సీనియర్ డీసీఎం తెలిపారు.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

... 5వ పేజీ తరువాయి

నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగిందని, కష్టపడే వారికి పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బదిలీల్లో ముఖ్యమంత్రి పక్కాగా ఉంటూ సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారన్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బాగా పనిచేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారని అభినందించారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు యత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు,విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజ వర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్‌కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్,పాల్గొన్నారు.

ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

... 5వ పేజీ తరువాయి

వచ్చి వంద రోజులు కూడా కాలేదని, అన్నీ తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నామని, త్వరలో విద్యాభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించి అందరికీ పంపిస్తామన్నారు. ఒకేసారి అంతా ఇంగ్లీష్ చేసేస్తున్నామంటే పిల్లలు ఇబ్బంది పడతారన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజిని క్రమేణా చేర్చుతామన్నారు. వచ్చే ఐదేళ్లలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నామని, అందరూ బాధ్యతగా పనిచేసి సహకరించాలని కోరారు. 'స్కూల్ మెయింటెనెన్స్ ఎప్పుడూ ఇట్లానే చేయండి. ఈసారి అధికారులకు చెప్పి వచ్చాను. నేను వస్తున్నానని బాగా చేసి ఉండొచ్చు. నెక్స్ట్ టైమ్ ఎవరికీ చెప్పకుండా సడన్‌గా నేనొక్కడినే వస్తాను, ఈ విషయాన్ని కారులో మా అధికారులకు కూడా చెప్పా..' అని అన్నారు. దాంతో అందరూ వెల్‌కమ్ సార్ అని అన్నారు. ఈ దశలో సిబ్బంది చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామనగా, డిఫరెంట్ పీపుల్, డిఫరెంట్ ప్రాబ్లమ్స్..అన్నీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌ను చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ కలిసారు. తమ కంపెనీ కేజీబీవీకి సీఎస్ఆర్‌లో చేస్తున్న సహకారాన్ని వివరించారు. ఓకే గుడ్ అంటూ, తర్వాత మరోసారి మాట్లాడదామని మంత్రి అన్నారు.

ఉక్కులో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

ఎవరు బయటకు వెళుతున్నారో తెలియడం లేదని, వచ్చేవారు, వెళ్లేవారు మెయిన్ గేటులో బయోమెట్రిక్ వేయాలని యాజమాన్యం ఆదేశించింది. ఈ విధానాన్ని మార్చి నెల నుంచి అమలులోకి తీసుకువచ్చింది. దానిని చాలామంది సీరియస్‌గా తీసుకోలేదు. కాంట్రాక్టు కార్మికులు చాలామంది పేర్లు నమోదు చేసుకోలేదు. ఆధార్ సమస్య వల్ల కొందరు పట్టించుకోలేదు. విధులకు వెళ్లి, తిరిగి వస్తున్నప్పుడు బయోమెట్రిక్ వేసేవారుకాదు. మరికొందరు ఇతర గేట్ల నుంచి వెళ్లిపోయేవారు. కాంట్రాక్టు కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇటీవల మే నెల వేతనాలు ఇవ్వాలని హాజరు పరిశీలించారు. మెయిన్‌గేటులో కాంట్రాక్టు కార్మికుల హాజరు తక్కువ ఉందని, విభాగాల్లో హాజరు ఎక్కువ ఉందని, దానికి కారణాలు ఏమిటో చెప్పాలంటూ వారం క్రితం ఇంజనీరింగ్ విభాగాల్లో 199 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అంటే వారు ప్లాంటులోకి రాకపోయినా హాజరు వేశారని పరోక్షంగా చెబుతూ దానికి వివరణ కోరింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చే హాజరునే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

యాజమాన్యం మెయిన్‌గేటులో బయోమెట్రిక్‌ను హాజరుగా పరిగణిస్తామని ప్రకటించలేదు. ఆ ప్రకారం కాంట్రాక్టర్లతో ఒప్పందమూ చేయలేదు. ఇప్పుడు మెయిన్ గేటు హాజరు ప్రకారమే వేతనాలు ఇస్తామని జూన్, జూలై, ఆగస్టు నెలలకు బిల్లులు తయారుచేయడంతో కాంట్రాక్టు కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. తమకు మెయిన్ గేటు తప్పనిసరి అని చెప్పలేదని, దానిని ఎలా పరిగణనలోకి తీసుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. ఉక్కు మంత్రిత్వ శాఖ బయోమెట్రిక్ అమలు వల్ల ఎంత మిగులు కనిపించిందో చెప్పాలని కోరడం వల్లనే యాజమాన్యం ఇప్పుడు ఈ తప్పుడు లెక్కలు వేస్తోందని ఆరోపిస్తున్నారు. దీనిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయాన్ని వేలాది మంది కార్మికులు ముట్టడించారు. తమకు విభాగాల్లో రిజిస్టర్ల ప్రకారమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ పేరుతో వేతనాల్లో కోత వేస్తే సహించబోమని స్పష్టంచేశారు. యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని వర్క్స్ సీజీఎం శ్రీధర్ హామీ ఇచ్చారు.

మెయిన్ గేటులో బయోమెట్రిక్ ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఇస్తామని యాజమాన్యం స్పష్టంగా చెప్పకపోవడం వల్లనే ఈ వివాదం చెలరేగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు యాజమాన్యం వారికి అధికారికంగా హాజరు చూపిస్తే, నిర్ణీత కాలం తరువాత వారిని పర్మినెంట్ కార్మికులుగా పరిగణించాల్సి ఉంటుందని, అందుకే మధ్యలో కాంట్రాక్టర్‌ని పెట్టి, వారితో హాజరు వేయిస్తారని, ఈ చిన్న విషయం కూడా గుర్తించకుండా యాజమాన్యం పెద్ద వివాదానికి కారణమైందని వాదనలు వినిపిస్తున్నాయి.

పనిదినాల కోతకు కొత్త నిర్ణయం

ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పనిదినాలు తగ్గించడానికి నిర్ణయం తీసుకున్నట్టు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్మికుల్లో 30 శాతం మందిని తగ్గించాలని ఆదేశించారని, దానికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారని చెబుతున్నారు. ఈ మేరకు కీలక విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు నెలకు తప్పనిసరిగా ఎనిమిది రోజులు సెలవు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంత ప్రాధాన్యం లేని విభాగాల్లో రోజు తప్పించి రోజు విధుల్లోకి రావాలని, నెలకు 15 రోజుల వేతనమే ఇస్తామని సమాచారం పంపారు. దీనిపై కూడా కాంట్రాక్టు కార్మికులు మండిపడుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న నీరు

రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం

రామ్‌నగర్, ఆగస్టు 30 : రామ్‌నగర్ బజార్ జంక్షన్ సమీపంలోని నెహ్రూనగర్ సచివాలయం వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మురుగు నీరు రోడ్డుపై నిత్యం ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజుల తరబడి ఈ సమస్య ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రోడ్డుపై ఒకవైపు మురుగు, మరో వైపు విపరీతమైన దుర్వాసన రావడంతో నివాసితులు నరక యాతన పడుతున్నారు.అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ వ్యాధి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వెంకోజీపాలెం, ఆగస్టు 30 : ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ సిబ్బంది డ్రై డే-ఫ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకరోజు ఇళ్లల్లో ఉండే నీళ్ల కుండీలను ఖాళీగా ఉంచాలని, దీనివల్ల దోమలు వ్యాప్తి చెంద కుండా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రి రమణ, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు హోమన హోటల్ జంక్షన్ వద్ద పారిశుధ్యం విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి పీతల అవినాష్, జీవీఎంసీ సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులకు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. కె.సుష్మిత సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, ఏఎన్ఎం హేమలత, ఆశా వర్కర్ స్వాతి, స్కూల్ కమిటీ చైర్మన్ షర్మిల పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో కూడా డ్రై డే ఫ్రై డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ, నాయకులు వంకర బాబూరావు, లాయర్ గోవింద్ పాల్గొన్నారు. 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలోనూ డ్రై డే - ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు.

వినాయక ఉత్సవానికి పందిరి రాట



రాట వేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మధురవాడ, ఆగస్టు 30 : పీఎం పాలెంలోని తారక రామనగర్‌లో సాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించనున్న వినాయకచవితి ఉత్సవాల కోసం శుక్రవారం పందిరి రాట వేశారు. కాలనీలో ప్రతి ఏటా మాదిరే ఈఏడాది కూడా వినాయక చవితి వేడుకలను అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, కె. ఆదినారాయణ తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక స్టేజీ ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రంగారావు, వెంకటలక్ష్మీ సత్యనారాయణ, వంశీ, ఉమా రామకృష్ణ, చిరంజీవి వర్మ, తిరుపతిరావు, బత్తుల గణేశ్, సతీశ్, నరసింగ్ పట్నాయక్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి, 22, క్యారెట్ 34, దొండకాయలు 22, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 120, బరబటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 32, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 245, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 75, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	88
ఫారం ధర	--	108
విత్ స్కిన్	--	186
స్కిన్‌లెస్	--	196

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



తర్లువాడలో మొక్క నాటుతున్న డీపీఓ శ్రీనివాసరావు



జూపార్కులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు
- ఆనందపునంలో వనం -మనం

ఆనందపురం, ఆగస్టు 30 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరరక్షణకు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తర్లువాడ గ్రామంలో జరిగిన వనం-మనం కార్యక్రమంలో మాట్లాడారు. మానవాళికి వృక్షసంపదే జీవనాధారమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ప్రతి సందర్భంలోనూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలి రాంబాబు నాయుడు, మజ్జి వెంకటరావు, తాత్రాజు ఆదినారాయణ, మజ్జి రమేష్‌నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి రామారావు, తదితరులు పాల్గొన్నారు. కాగా వేములవలస, గంభీరం పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను డీపీఓ సందర్శించి, పంచాయతీ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఆరిలోవ : కేంద్ర కారాగారం సమీపంలోని శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపావతి మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ టీకే రమేష్, స్కూల్ కమిటీ చైర్మన్ గంగరాజు పాల్గొన్నారు. అలాగే పైనాపిల్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రామరాజు ఆధ్వర్యంలో, 12వ వార్డులోని మయూరినగర్‌లో టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, ఒమ్మి రాజు పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాలలో...

సాగర్‌నగర్ : బీచ్ రోడ్డులో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలోనూ వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ నూర్జహాన్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె పర్యావరణ పరిరక్షణకు మొక్కల ఆవశ్యకతపై బాలి కలకు వివరించారు.

సింగనబందలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని సింగనబందలోనూ వన మహోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ జానకి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నళిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





వేదికపై పూజ చేస్తున్న పండితులు, వ్రతంలో పాల్గొన్న మహిళలు

సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతం

సింహాచలం, ఆగస్టు 30 : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు. ముందుగా అప్పన్న ఆలయంలో ప్రభాతారాధనలు తరువాత అమ్మవారి ప్రత్యేక విగ్రహాన్ని క్షేత్ర పాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయానికి సమీపంలోని యాత్రిక్ సదన్‌లో ఏర్పాటు చేసిన వేదికపై అధిష్టింపజేశారు.వ్రతంలో పాల్గొన్న వారికి దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది పూజా సామగ్రి అందజేశారు. తరువాత పండితులు శాస్త్రోక్తముగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలను సమర్పించారు. అనంతరం లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ మహిళలతో అమ్మవారి ప్రతిమకు కుంకుమార్చన చేయించారు. పూజ తరువాత పండితులు వేదశీర్వచనాలీయగా, అధికారులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. వ్రత ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాసరాజు చేపట్టారు.



పోటులో లడ్డూ తయారీని పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

ప్రసాదాల నాణ్యతను పరిశీలించిన ఈఓ

సింహాచలం, ఆగస్టు 30 : భక్తులకు విక్రయించే లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. ఇటీవల కొందరు భక్తుల నుంచి ప్రసాదాల నాణ్యతపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఆయన ప్రసాదాల తయారీ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొందరు భక్తులకు ప్రసాదాలు అందజేసి వారు తిన్న తరువాత రుచి విషయమై ఆరా తీశారు. భక్తుల నుంచి సానుకూలంగా సమాధానం రావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత పోటులో లడ్డూ తయారీ విభాగానికి వెళ్లి లడ్డూల తయారీ, నాణ్యతను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ వద్దని అధికారులకు సూచించారు. అనంతరం నిత్యాన్న ప్రసాద పథకం కింద భోజనాలు చేస్తున్న భక్తుల నుంచి కూడా ఈఓ రుచి, శుచి, నాణ్యత వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్. ఆనందకుమార్, ప్రసాదాల విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు, పర్యవేక్షణాధికారి పి. సునీల్ కుమార్, పీఆర్‌ఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ శ్రీధర్

జూపార్కులో ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభం

ఆరిలోవ, ఆగస్టు 30 : జూపార్కులో దివీస్ సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు ఆర్‌ఓ ప్లాంట్లను రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఎస్ఎస్ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు వల్ల పర్యాటకులకు సురక్షితమైన తాగునీరు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, మంగమ్మ, దివీస్ ల్యాబ్ జీఎం వైఎస్‌కోటేశ్వరరావు,మేనేజర్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకముందు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు ఎన్‌క్లోజర్‌లలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఎన్‌క్లోజర్లలో మొక్కలు నాటడం వల్ల జంతువులకు చల్లదనం ఉంటుందన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు దోహదం కలుగుతుందని చెప్పారు. అనంతరం డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కరువు



దాకమర్రిలో పొలాల్లో కుప్పలుగా వేసిన మొక్కజొన్న కంకులు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 30 : మండలంలోని రైతులు మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేక దిగాలు చెందుతున్నారు. ఈఏడాది ఈ పంట అత్యధికంగా దిగుబడి ఉండడంతో రైతులు కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది మంచి ధర పలకడంతో నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో రైతులు మొక్కజొన్న సాగు ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టారు. కూరగాయలు, పూలు సాగు చేస్తున్న కొంత మంది వాటి స్థానంలో మొక్కజొన్న వేశారు. ఈఏడాది దిగుబడి అత్యధికంగా రావడంతో ధర పూర్తిగా పడిపోయింది. దీంతో రైతులు ఎంతో కొంతకు వీటిని అమ్ముకోవలసి వస్తోంది. మొక్కజొన్నను కోళ్ల దాణా తయారీకి ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ ఏడాది ఈ తయారీ కూడా బాగా తగ్గిపోయింది. దీంతో పొలాల నుంచి కోసిన కంకుల్ని అక్కడే కుప్పగా వేసి కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమంది రైతులు బస్తాలతో అమ్ముకోవడం కష్టం అవుతుందని చిల్లర అమ్మకానికి పెడుతున్నారు. సంతల్లో అమ్మకాలు చేసేవారు రైతుల వద్దకు నేరుగా వెళ్లి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయాలు చేపడుతున్నారు. తగరపువలస, ఆనందపురం, బోయిపాలెం తదితర ప్రాంతాల్లోని సంతల్లో అనేక మంది బుట్టలతో తీసుకువచ్చి అమ్ముతున్నారు. ప్రారంభంలో రూ. 5లకు ఒకటి చొప్పున అమ్మేవారు. ఇప్పుడు పది రూపాయలకు మూడు చొప్పున అమ్ముతున్నారు. ఈ ధర మరింత తగ్గనున్నట్టు రైతులు చెబుతున్నారు.

పాఠశాల ఆవరణలోకి పశువులు

ఆరిలోవ, ఆగస్టు 30 : గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. పాఠశాల ఆవరణలో అనాథ పిల్లల వసతి గృహం కూడా ఉంది. ఇక్కడ సుమారు 300 మంది పిల్లలు ఉంటున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు ఆవరణలోకి వస్తున్నాయి. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు పశువులు ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెదవాల్తేరు, ఆగస్టు 30 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో పద్మనాభం, నారాయణరాజుపేటకు చెందిన 200 మంది శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్రధాని మోదీ పేదల సంక్షేమానికి 188కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెడ్డిపిల్లి శ్రీనివాసరావు, రూపాకుల రవికుమార్, బుద్ద లక్ష్మీనారాయణ, ఎస్‌ఏ రామ్మోహన్, పసుపులేటి శ్రీనివాసరావు, ఉప్పాడ అప్పారావు, పీవీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

నగరానికి రాజ్యసభ స్టాండింగ్ కమిటీ

గోపాలపట్నం, ఆగస్టు 30: దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా రాజ్యసభ స్టాండింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. చెన్నై నుంచి విశాఖ చేరుకున్న బృందానికి పలువురు అధికారులు స్వాగతం పలికారు. సుజిత్‌కుమార్ చైర్మన్‌గా ఉన్న కమిటీలో సుమిత్ర బాల్మిక్, రాజేంద్ర గెహ్లాట్, డాక్టర్ ధర్మస్థల వీరేంద్ర హెగ్డే, నాబమ్ రెబియా, కార్తికేయ శర్మ, అరుణ్‌సింగ్, తిరుచ్చి శివ సభ్యులు. కమిటీ రాత్రి నగరంలో బస చేసి, శనివారం ఉదయం పది గంటలకు విశాఖపట్నం పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, ఏపీ ఎండీసీ, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమావేశమై వారినుంచి పిటీషన్లు స్వీకరిస్తుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు మెడ్‌టెక్‌జోన్‌ను సందర్శించి సంస్థ ప్రతినిధులతో సమావేశమవుతుంది. కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్ ఏసియా బయోమెడికల్స్, మోల్బియో డయోగ్నోస్టిక్స్ సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమావేశమై పిటీషన్లు స్వీకరిస్తుంది. రాత్రి నగరంలోనే బస చేసి ఆదివారం మధ్యాహ్నం 12.35 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి న్యూఢిల్లీ వెళ్తుంది.



విమానాశ్రయంలో రాజ్యసభ స్టాండింగ్ కమిటీ సభ్యులు

అప్పన్న సన్నిధిలో లక్ష కుంకుమార్చన



శ్రావణలక్ష్మీకి హారతి ఇస్తున్న పురోహితుడు

సింహాచలం, ఆగస్టు 30 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శ్రావణ మాస నాల్గవ శుక్రవారం పురస్కరించుకుని శ్రావణ లక్ష్మీకి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. సువర్ణ అమ్మవారు, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు సారధ్యంలో వైదికులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శ్రీమహాలక్ష్మీ సహస్రనామావళి పఠించి, కుంకుమతో పూజ చేసి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తరువాత ఆలయ బేడా మండపంలో పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

శాకంబరిగా విజయ దుర్గమ్మ



ఆరిలోవ, ఆగస్టు 30 : హనుమంతవాక జంక్షన్ సమీపంలోని విజయదుర్గా కాలనీలో వెలసిన విజయదుర్గ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమ్మవారిని పలు కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఈమేరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు



కొమ్మాది, ఆగస్టు 30 : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అన్నంరాజునగర్‌లోని అష్ట లక్ష్మీ దేవాలయంలో లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణులను వజ్ర కవచధారణతో అలంకరించి 108 చీరలతో పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు చేశారు.

శ్రావణలక్ష్మీకి వైభవంగా తిరువీధి

సింహాచలం, ఆగస్టు 30 : సింహగిరిపై శుక్రవారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి వైభవంగా నిర్వహించారు. సువర్ణ అమ్మవారు, చతుర్భుజి తాయారు ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదపఠనాల నడుమ ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం



హవనం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, ఆగస్టు 30 : రాముడి జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని సింహగిరిపై ఈశాన్య దిక్కున గంగధార సమీపంలో కొలువుదీరి ఉన్న సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే పునర్వసు నక్షత్రం రోజున ఈ హవనాన్ని చేయడం ఆనవాయితీ. ఈమేరకు ప్రభాతారాధనలు జరిపి ముందుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సీతా, లక్ష్మణ హనుమ సమేత శ్రీరాముని ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములతో శ్రీకారం చుట్టి శాస్త్ర ప్రకారం బింబారాధన, మండపారాధన, కలశారాధనలు చేసి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. తరువాత శ్రీమద్రామాయణంలో సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్ర జపంతో హవనాన్ని నిర్వహించారు.

సీపీఎస్ రద్దు చేయాలని వినతి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 30 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పింఛన్ విధానాన్ని రద్దు చేసి గతంలో ఉన్న పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన పింఛన్ విధానం వల్ల చాలామంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

పద్మనాభం (రూరల్), ఆగస్టు 30 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న సూచించారు. పాండ్రంగి, మునివానిపాలెం గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

ఐఎన్ఎస్ ఏక్‌శిలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్త దానం చేస్తున్న ఉద్యోగులు

భీమునిపట్నం, ఆగస్టు 30 : విశాఖ ఐఎన్ఎస్ ఏక్‌శిల 24వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఆ క్యాంపస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 250 మంది రక్త దానం చేశారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పద్మనాభం, ఆగస్టు 30 : మండలంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 7937 మంది పింఛన్‌దారులుండగా, వారికి 116 మంది సచివాలయ ఉద్యోగులు నగదు అందజేయనున్నారు. ఈమేరకు రూ.3,2339500 నగదును ఆయా ఉద్యోగులు బ్యాంకుల నుంచి డ్రా చేసి పంపిణీకి సిద్ధం చేసుకున్నారు.

విత్తనాల తయారీపై అవగాహన అవసరం

పద్మనాభం, ఆగస్టు 30 : రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడానికి విత్తనోత్పత్తి పథకాన్ని అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకుడు బి.విజయ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన కృష్ణాపురం, పొట్నూరు గ్రామాల్లోని రైతులకు విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 60 బస్తాలు బీపీటీ 5204 రకం విత్తనాలను రైతులకు ఇచ్చామన్నారు. వారు విత్తనాలను అభివృద్ధి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి రైతులందరికీ సరఫరా చేయాలన్నారు. అనంతరం అధికారులు ఎరువుల యాజమాన్యం పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, ఏఓలు ఎంవీఎస్ చలం, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ విజయ్‌ప్రసాద్